



క్రియ పోటీల్లో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



అర్ధనారీశ్వరుడిగా.. చిన్నారి ప్రదర్శన



తందాన..తాన.. బుర్రకథ చెప్తున్న విద్యార్థులు



బ్లాక్ అండ్ వైట్.. మైమ్ యాక్షన్‌లో..



కడవ మీద కడవ పెట్టి.. సంప్రదాయ లంబాడీ వస్త్రధారణలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన




ఆదిపరాశక్తి.. అమ్మవారి ఉగ్రరూపంలో విద్యార్థిని

'క్రియ' అదిరింది!

ఏమి ప్రదర్శనలు.. ఏమి వేషధారణలు.. ఆకట్టుకునే కట్టు, బొట్టులతో.. సంప్రదాయ వస్త్రధారణలతో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత వాయిద్యాలు, సైన్స్ ప్రాజెక్టులు, బుర్రకథ, చిత్రలేఖనం, మైమ్ వంటి అనే ప్రదర్శనలతో 'క్రియ' అదిరింది. విద్యార్థులు విజ్ఞానంతోపాటు వినోదాన్ని మేళవించి తమ ప్రదర్శనలతో వావ్వా అనిపించుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూకేలో రెండోరోజు 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర్ పాఠశాలల సాంస్కృతిక పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. వేలసంఖ్యలో చిన్నారులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. వివరాలు 7లో..



పాతాళభైరవి రా.. కపాల మాంత్రికుడి వేషధారణలో విద్యార్థి ప్రదర్శన



సై..బర్ తెగింపు!

సైబర్ క్రైం ఏడాది 2024.. ఎలా ఖాతాలోని డబ్బుపోయిందో తెలియదు.. కానీ ఖాతా ఖాళీ అయిపోతుందంతే.. రెక్కీ చేయడం.. ఇంటిని ఎంపిక చేసుకోవడం.. రాత్రి వేళల్లో కన్నం వేయడం.. దొరికింది దోచుకుపోవడం.. ఇదంతా ఓల్డ్.. కాలం మారింది.. సాంకేతికతతో కంటికి కనిపించని కేటుగాళ్లు క్షణాల్లో జనాల ఖాతాల్లోని డబ్బును ఖాళీ చేసేస్తున్నారు. సైబర్ నిపుణులకు అంతుచిక్కని విధంగా దోచుకుంటున్నారు. మరో వైపు హనీట్రాప్..ఇంకో వైపు డిజిటల్ అరెస్టులు.. ఇలా ఒకటేమిటి నేర స్వభావం తీరే మారిపోయింది.. తస్మాత్ జాగ్రత్త.. ఆద మరుపుగా ఉంటే అంతే.. ఇక రోడ్డు ప్రమాదాలు.. ఆత్మహత్యలు షరా మామూలే.. ప్రతి జిల్లాలో ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు 500 దాటాయి.. మూడు జిల్లాల్లో సుమారుగా 800 మంది వర కూ మృత్యువాత పడినట్టు సమాచారం. హత్యలు అదేస్థాయిలో పెరిగాయి.. పాతకక్షలు పడగవిప్పాయి.. ఏడాదంతా చూస్తే రక్తపాతమే.. ఏదో ఒక మూల ప్రమాదమే. ఎక్కడా ప్రశాంతత లేదు..

- సాంకేతికత తెచ్చిన కొత్త చిక్కు
- ఉమ్మడి జిల్లాలో దోపిడీలు
- కంటికి కనిపించని కేటుగాళ్లు
- హనీట్రాప్.. డిజిటల్ అరెస్టులు
- పోలీసులకు చిక్కని వైనం
- పడగవిప్పిన పాతకక్షలు
- పచ్చని తూర్పున హత్యలు
- ఆత్మహత్యలకు అంతే లేదు
- పెరిగిన రోడ్డు ప్రమాదాలు
- 800 మంది మృత్యువాత

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సాంకేతిక ఏ స్థాయిలో పెరుగుతుందో సైబర్ నేరాలు అదే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇవి సమాజ భద్రతకు పెనుసవాళ్లుగా మారాయి. పోలీస్ వ్యవస్థకు అంతుబట్టని విధంగా ఈ నేరాలు మారాయి. ఆన్‌లైన్ యాప్‌లు మోసాలతో అనేక మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఏవో లింక్‌లు, మెసేజ్ పంపి, వాటిని చూడానికి బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయిపోతున్న ఉదం తాలు పెరిగాయి. స్టాక్ మార్కెట్ పేరిట మోసాలు జరుగుతున్నాయి. ఇటీవల డబ్బున్నవాళ్లు, అధికారులు,ఉద్యోగస్తులు, వ్యాపారులే టార్గెట్‌గా డిజిటల్ అరెస్ట్‌లు మొదలయ్యాయి. జార్ఖండ్‌లో జాంతార జిల్లా కేంద్రంగా ఇవి ఎక్కువగా జరుగుతున్నట్టు పోలీసులు పసిగట్టారు. ఢిల్లీ, నోయిడా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి డిజిటల్ అరెస్ట్‌లు జరుగుతున్నట్టు సమాచారం. జిల్లాలో కొద్ది నెలల కిందట మోరంపూడి సెంటర్ ప్రాంతంలో ఓ డాక్టర్‌కు ఫోన్ చేసి డిజిటల్ అరెస్ట్ చేసి రూ.8లక్షలు లాగేశారు. ఆఫీసర్స్ క్లబ్‌లో కోచ్‌గా పనిచేస్తున్న ఒకాయనను భయపెట్టి, డిజిటల్ అరెస్ట్ చేసి రూ.96వేలు లాగేశారు. రామచంద్రపురంలో ఒకాయనకు ఫోన్ చేశారు. రాజమండ్రికి చెందిన ఓ ఏసీటీవోను కొంతకాలం కిందట హనీ ట్రాప్ చేశారు. ఒక అమ్మాయి ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టగా ఆయన ఓకే చేశారు. తర్వాత న్యూడ్ వీడియో రాగా చూసి చాటింగ్ మొదలెట్టాడు. తర్వాత అతన్ని బెదిరించడంతో కొంత డబ్బు పోగొట్టుకుని పోలీసులను ఆశ్రయించాడు. కడియంలో ఒక విద్యార్థికి ఉద్యోగం ఆశ చూపి రూ.10లక్షలు లాగేశారు. రాజమహేంద్రవరానికి చెందిన ఓ స్టాక్ మార్కెట్ చేసే యువకుడు రూ.33 లక్షల వరకూ నష్టపోయాడు. జిల్లాలో ఈ తరహా నేరాలు పెరిగిపోయాయి. కానీ చాలా తక్కువమంది మాత్రమే పోలీసులను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో ఈఏడాది 140 సైబర్ నేరాలు.. 11 డిజిటల్ అరెస్ట్‌లు జరిగాయి. సైబర్ నేరాలు, డిజిటల్ అరెస్ట్‌లు ప్రమాదంనుంచి తప్పించుకోవాలంటే కేవలం అవగాహన ఒకటే మార్గం. ఈ ఏడాది 500 వరకూ ప్రమాదాలు జరగ్గా 700 మందికిపైగా క్షతగాత్రు లయ్యారు.300 మంది మృత్యువాతపడ్డారు. వీరిలో తలకు గాయం కావడం వల్ల 90మంది వరకూ ప్రాణాలొదిలారు. ఈ ఏడాదిలో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై 45వేల కేసులు నమోదు చేయగా రూ.50 లక్షలవరకూ జరిమానాలు విధించారు.ఈ ఏడాది అక్టోబరు 15న జరిగిన మహిళ అత్యాచారం జిల్లాను కుదిపే సింది. కడియం మండలం బుర్రిలంకలో నర్సరీలో పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న రైతు కస్తూరి అనే మహిళపై నలుగురు అత్యాచారం చేసి చంపేసి కాలువలో పడేశారు. ఉండ్రాజవరం మండలంలో అక్టోబరు 30న దీపావళి టపాసుల తయారీకేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించి ఇద్దరు ప్రాణాలు వదిలారు. ఇదే మండలంలో ఫ్లెక్సీ కడుతుండగా కరెంట్ షాక్‌కి గురై నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దేవరపల్లి మండలంలో జీడిపిక్కల లోడుతో వెళ్తున్న వ్యాన్ తిరగబడడంతో నిడదవోలు మండలానికి చెందిన ఎనిమిది మంది చనిపోయారు. ఈ ఏడాది రహదారులు రక్తాన్ని తాగేశాయి.



గన్నవరం వద్ద జరిగిన ప్రమాదంలో మృతిచెందిన భార్య, కుమారుడిని పట్టుకుని రోదిస్తున్న భర్త

కోనసీమలోనూ రక్తపాతం..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదాలు..హత్యలు.. దొంగతనాలు.. దోపిడీలతో పాటు సైబర్ నేరాలతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 2024 సంవత్సరం రికార్డులకెక్కింది. గంజాయి..అక్రమ మద్యం రవాణా..దోపిడీలు, దొంగతనాలు అదే స్థాయిలో ఉన్నాయి. ఇక రోడ్డు ప్రమాదాల్లో యువకులే ఎక్కువమంది ప్రాణాలు కోల్పోయారు. అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వివాహేతర సంబంధాలు, భూవివాదాలతో కొందరు హత్యలకు గురైన ఘటనలు ఉన్నాయి.జిల్లాలో 2024 సంవత్సరంలో హత్యో దంతాలు సంచలనం రేకెత్తించాయి. గతేడాది జరిగిన అయినవిల్లి గ్రామానికి చెందిన జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసును ఇటీవల పోలీసులు ఛేదించి ఆ కేసులో వైసీపీ నేత తనయుడు పినిపే శ్రీకాంత్‌ను అరెస్టు చేయడం సంచలనమైంది. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో పెంచుకున్న కొడుకు రాంబాబు ఆస్తికోసం తండ్రి రావి వీరవెంకటనరసింహారావు(75)ను హత్య చేశాడు. ఈఏడాది ఆత్మ హత్యల సంఖ్య గణనీయంగా పెరిగింది. జిల్లాలో రోడ్డు ప్రమాద ఘటనలు నిత్యం మృత్యు ఘంటికలు మోగిస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మే నెలాఖరునాటికి 65 మంది మృతిచెందగా 230మందికిపైగా గాయపడ్డారు. ప్రధాన రహదారులపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 53 కేసుల్లో 65మంది మృతిచెందారు. 145 కేసుల్లో 230 మందికి గాయాలయ్యాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఏడాదిలో భారీ దొంగతనాలు, దోపిడీలు జరిగాయి. పోలీసులు కూడా కేసుల పురోగతి సాధించి రికవరీ కూడా అదేస్థాయిలో చేశారు.



హత్య కేసులో అరెస్టయిన పినిపె శ్రీకాంత్(ఫైల్)



కాకినాడలో కత్తులు దూశారు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో నేరాలు,ఘోరాలు పెరిగాయి.హత్యలతో అట్టుడికింది. బ్యాంకు చోరీల దగ్గరనుంచి తుపాకీ చూపించి జ్యూయలరీ షాపుల్లో బంగారం ఎత్తుకుపోవడం, ప్రతీకారేచ్ఛతో నరుక్కోవడం వరకు అనేక పెనుసంచలనాలకు జిల్లా కేంద్రంగా మారింది. అక్టోబరు 31న అర్ధరాత్రి కాజులూరు మండలం శలపాక లో ముగ్గురి దారుణహత్య జరిగింది. పాత కక్షల నేపథ్యంలో ఒకే కుటుంబంలో ముగ్గురు దారుణ హత్యకు గురయ్యారు.ఇదే తరహాలో డిసెంబరు 15న సామర్లకోట మండలం వేట్లపాలెం లో స్థలం ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నారనే ఆగ్రహంతో దళితవాడలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని ప్రత్యర్థి కుటుంబం దారుణంగా నరికి చంపేసింది. జనవరి 23న కాకినాడలో ఏసీబీకి డ్రైనేజీ విభాగం ఈఈ పట్టుబడడంతో ఉద్యోగుల్లో దడ పెంచింది. ఫిబ్రవరి 8న ప్రత్తిపాడు స్టేట్ బ్యాంకులో జరిగిన భారీ చోరీ పోలీసులనే బెంబేలెత్తించింది. యూపీకి చెందిన ఓ ముఠా అర్ధరాత్రి వేళ ఏకంగా బ్యాంకుకే కన్నం వేశారు.ఈ ఘటనలో రూ.1.50 కోట్ల విలువైన బంగారం, రూ.30 లక్షల నగదు సైతం తస్కరించారు. ఫిబ్రవరి 28న ప్రత్తిపాడు వద్ద హైవేపై వెళ్తున్న లారీకి పంక్చర్ పడడంతో డ్రైవర్, ఇద్దరు క్లీనర్లు చూస్తుండగా రాజమహేంద్ర వరం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని వెళ్లిపోవడంతో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. మార్చి 20న చేబ్రోలులో జంట హత్యలు తీవ్ర కలకలం రేపాయి.ఏప్రిల్ 1న కత్తిపూడిలో ఓ దుకాణంలో వెల్డింగ్ చేస్తుండగా ట్యాంకర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. జూలై 20న కాకినాడ కల్పన సెంటర్‌లో రాత్రి 9గంటలకు వేగంగా వచ్చిన ఓ కొత్తకారు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిని ఓ పాదచారిని ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఆగస్టు 21న అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంసెజ్‌లో జరిగిన ఫార్మా కంపెనీ ప్రమాదంలో 18 మంది చనిపోయారు.వీరిలో ఇద్దరు కాకినాడ జిల్లాకు చెందిన వారు ఉండడం విషాదం నింపింది. డిసెంబరు చివరి వారంలో వరుసగా కాకినాడ, అన్నవరంలో రెండు వేర్వేరు జ్యూయలరీ దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి. ఇలా కాకినాడ జిల్లాలోను కలకలం రేగింది.

ఆర్ఎంసీలో ఘనంగా స్వామి వివేకానంద యువజనోత్సవాలు

జీజీహెచ్(కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్ఎంసీ)లో స్వామివివేకానంద యువజనోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జనవరి 12న నేషనల్ యూత్ డేను పురస్కరించుకుని ఎన్ఎంఓ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ఎంసీ డిజిటల్ లైబ్రరీలో స్వామి వివేకానంద యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (ఎన్ఎంఓ) ఏపీ జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎ.హర్షవర్ధన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైద్యవిద్యార్థులకు స్వామివివేకానంద ఔన్నత్యంపై వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ పర్యవేక్షణలో డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ యు.రామకృష్ణ,వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ అద్దాల సత్యనారాయణ, డాక్టర్‌కామిరెడ్డి రాజేష్, డాక్టర్ పద్మదీపిక ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు.డాక్టర్ సమంత్, డాక్టర్ ప్రదీప్‌భాస్కర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ సోమవారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లో జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈకార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరుకావాలన్నారు.

యాంకరేజ్ పోర్టుకు చేరుకున్న రేషన్ బియ్యం

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): స్టెల్లా ఎల్ నౌక నుంచి 1320 మెట్రిక్ టన్నుల రేషన్‌బియ్యం కాకినాడ యాంకరేజ్ పోర్టుకు ఆదివారం చేరుకుంది. పోర్టునుంచి ఆ రేషన్‌బియ్యాన్ని సివిల్ సప్లయిస్ గోడౌముల్లో భద్రపర్చుతున్నారు. ఎగుమతికి సిద్ధంగా ఉన్న 19,785 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని నౌకలోకి ఎక్కిస్తున్నారు. రేషన్ బియ్యం రవాణాకు సంబంధించి సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్‌పై సోమవారం కేసు నమోదయ్యే అవకాశం ఉంది.

మూడో నెలా.. ముందస్తుగానే

- పింఛన్ల పంపిణీకి సిద్ధం

సామర్లకోట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రతినెలా 1న సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం ప్రతినెల రికార్డులను అధిగమిస్తోంది. ఈక్రమంలో ఒకటో తేదీ సెలవు దినమైతే ఆ తర్వాత రోజు కాకుండా ముందు రోజే పింఛన్లు నగదు అందజేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయి ఏడో నెల సమీపిస్తోంది. ఇప్పటికీ ఆరునెలలు పింఛన్లు పంపిణీ జరగ్గా జనవరి ఏడో నెల అవుతుంది. ఈ క్రమంలో ఒకటో తేదీ కంటే ముందుగానే ఈనెలతో మూడు నెల పింఛన్ల పంపిణీ జరగనుంది. కొత్తఏడాది జనవరి 1వ తేదీ కావడంతో ఒక రోజు ముందు డిసెంబరు 31నే పింఛన్ల పంపిణీ చేయనున్నారు. దీనికిగాను 30వతేదీనే నగదు డ్రా చేయనున్నారు. 31న మంగళవారం పింఛన్ల పంపిణీకి అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది.

95శాతానికి పైగానే పంపిణీ..

వలంటీర్లు లేకుండా ఇంటింటా పింఛను పంపిణీ సాధ్యం కాదనే గత వైసీపీ ప్రభుత్వ వాదనను కూటమి ప్రభుత్వం పూర్తిగా అధిగమించింది. అందుబాటులో ఉన్న సచివాలయ సిబ్బందితోనే ప్రతినెల ఒక్క రోజులోనే 95 శాతానికిపైగా పింఛన్లను లబ్ధిదారులకు అందించగలిగింది. ప్రతినెలా రాష్ట్రంలోని ఏదొక గ్రామంలో సీఎం చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఈక్రమంలో ఈసారి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏదొక ప్రాంతంలోఆయన హాజరయ్యే అవకాశాలున్నాయని సమాచారం.

జిల్లాలో 2,79,805మంది లబ్ధిదారులు

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా కింద 2,79,805 పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రతినెలా రూ.82కోట్ల88లక్షల 74వేలను పింఛన్ సొమ్ముగా పంపిణీ చేస్తోంది. వాటిలో వృద్ధులు 1,38,249మంది, వితంతువులు 73,560మంది, వికలాంగులు 35,576 మంది, ఒంటరి మహిళలు 7,898 మంది, మత్స్యకారులు 6,427మంది, చేనేతలు 3,541మంది, కల్లుగీత కార్మికులు 3,469మంది, ట్రెడిషనల్ కాబలర్స్ 1,885మంది, డప్పు కళాకారులు 1,601మంది, అనారోగ్య రీత్యా లబ్ధిదారులు 752మంది, అభయహస్తం 6,198మంది, సీకేడీయు ప్రైవేట్ 308మంది, సీకేడీయు ప్రభుత్వ 105మంది, ట్రాన్స్‌జెండర్స్ 110మంది, సైనిక సంక్షేమం 23మంది, అమరావతి లాండ్‌లెస్‌పూర్ 3 ఉన్నారు.

‘క్రియ’ అదిరింది!

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు
- రెండోరోజూ ప్రతిభకు పట్టాభిషేకం
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు
- ముగిసిన రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు


సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారి

సర్పవరంజంక్షన్, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): కాకినాడలో నిర్వహిస్తున్న క్రియ పిల్లల పండుగ అంబరాన్నంటింది. రెండురోజులపాటు జరిగిన పోటీల్లో విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక నృత్యప్రదర్శనలు, మైమరిపించే కోలాట నృత్యాలు, అబ్బురపరిచే రీతిలో ఆకట్టుకునేలా చిన్నారులు గీసిన పెయింటింగ్స్‌తో ఆకట్టుకున్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో రెండురోజులుగానిర్వహిస్తున్న 11వ రాష్ట్రస్థాయి క్రియ అంతర పాఠశాలల సాంస్కృతిక పోటీలు ఘనంగా ముగిశాయి. ముగింపు పోటీలో లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ పాల్గొన్నారు. సైన్స్ ఫేర్, చిత్రలేఖనం, సాంస్కృతిక నృత్యాలు, క్విజ్ పోటీలను స్వయం వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు.






వివిధ రకాల సంప్రదాయ దుస్తులతో సాంస్కృతిక ప్రదర్శనల్లో విద్యార్థినులు

రెండోరోజు కార్యక్రమంలో భాగంగా జానపద నృత్యం (బృందం) విచిత్ర వేషధారణ(ఫ్యాన్సీ డ్రెస్), బుర్ర కథ, కోలాటం, ప్రాజెక్టు పని, వాద్య సంగీతం, మాటలు, కథ చెప్పడం, స్పెల్లింగ్, చిత్రలేఖనం, సృజనాత్మక వస్తువుల తయారీ, మైమ్, మట్టితో బొమ్మలు తదిర అంశాల్లో పోటీలు జరిగాయి. 5వ తరగతి వరకు సబ్ జూనియర్స్, 6, 7 తరగతులకు జూనియర్స్, 8,9,10 తరగతి విద్యార్థులు సీనియర్స్ విభాగంలో రెండురోజులపాటు పోటీలు జరిగాయి. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించిన విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో ఏపీ, తెలంగాణాకు చెందిన 350 పాఠశాలలకు చెందిన 11వేలమంది విద్యార్థులు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమం లో సంస్థ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ జగన్నాథరాజు, డాక్టర్ కాద వెంకటరమణ, చుండ్రు జానకీరామ్ ప్రసాద్, మాచిరాజు, అల్లూరి సురేంద్ర, బత్తుల గణేష్, శివ, కృష్ణంరాజు పాల్గొన్నారు. పోటీలకు ప్రాంగణం ఇచ్చిన జేఎన్‌టీయూ వీసీ, దాతలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.


పిట్టల దొరగా..


యముడిగా..


అమ్మవారిగా..


మైమ్ యాక్షన్‌లో...


సంప్రదాయ వేషధారణలో..


‘భువనం విజయం’ గురించి వివరిస్తూ..


కార్మికులు.. రైతు కూలీలుగా..


గిటార్ వాయిస్తూ..


‘ఆదర్శ గ్రామం’ ప్రాజెక్టులో..


మట్టితో అందమైన అక్షరాలు

ఆటో...బైక్!



తాళ్లరేవు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు-సుంకటరేవు 216 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఆటో ఎదుటి భాగంపై బైక్ ఎక్కింది. ఈ సంఘటనలో యువకుడికి గాయాలైనట్టు కోరంగ ఎస్ఐ పి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. తాళ్లరేవు పంచాయతీ జెల్లావారిపేటకు చెందిన దాసరి నూకరాజు బైక్‌పై తాళ్లరేవు నుంచి నీలపల్లి వెళ్తుండగా మార్గమధ్యంలో సుంకటరేవు వద్ద యానాం నుంచి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనగా బైక్ ఆటో ఎదుటిభాగంపైకి ఎక్కింది. నూకరాజుకు గాయాలవ్వగా పోలీసులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

పోలీస్ కానిస్టేబుళ్ల ఎంపికకు...

నేటి నుంచి దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ల నియామకానికి ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు సోమవారం నుంచి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ ఎంపిక పారదర్శకంగా నిర్వహించేందుకు కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పటిష్ట చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 30 నుంచి జనవరి 18 వరకు నిర్వహించే ఈ దేహదారుఢ్య పరీక్షల్లో భాగంగా బయోమెట్రిక్, 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్‌జంప్ పరీక్షల నిర్వహణ, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితర పరీక్షల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ నేపథ్యంలో ఎస్పీ ఆదివారం పరేడ్ గ్రౌండ్‌లో ట్రైల్ రన్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సివిల్ పోలీస్ కానిస్టేబుళ్ల 381 పోస్టులకు, అలాగే ఏపీఎస్పీ ఐఆర్ బెటాలియన్ కానిస్టేబుళ్ల 630 పోస్టులు పురుష అభ్యర్థులు 6,333, మహిళా అభ్యర్థులు 1,449 హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఆడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్‌బి డిఎస్పీ శ్రీరామకోటేశ్వరరావ్ తదితరులు పాల్గొన్నారు.

తాబేళ్ల మరణంపై విచారణ చేపట్టాలి

డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బీచ్ రోడ్, ఏపీఐఐసీ, వాకలపూడి ప్రాంతాల్లో అరుదైన ఆలివ్‌రిడ్లీ తాబేళ్లు అత్యధిక సంఖ్యలో మరణిస్తున్న విషయం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి వచ్చింది. తాబేళ్ల మరణానికి కారణాలు విచారించి, దీనికి కారణమవు తున్న వారిపై చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అండ్ హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ చిరంజీవిచౌదరిని ఆదేశించారు.

అత్మహత్యాయత్నానికి పాల్పడిన

మానసిక రోగి మృతి

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఓ మానసిక రోగి దుస్తులకు నిప్పు అట్టించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. బర్న్స్ వార్డులో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం కొవ్వాడకు చెందిన గొల్లపల్లి విశాలాక్షి (33) 10 ఏళ్ల క్రితం డిగ్రీ పూర్తై బీటెక్‌ ప్రిపేరైంది. ఆ సమయంలో మెదడులో కణితి ఏర్పడి మానసిక ప్రవర్తనలో తేడా వచ్చింది. కుటుంబీకులు 15రోజుల క్రితం కాకినాడ జీజీహెచ్‌లోను సైకియాట్రీ వార్డులో చేర్పించగా ఫిమేల్ సెల్‌లో ఉంచి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. అందరిని కొడుతుండడంతో మంగళవారం ఆమెను లోపల ఉంచి గెడపెట్టి బయట తల్లిదండ్రులు ఉన్నారు. విశాలాక్షికి ఇంజక్షన్ టైం అవ్వడంతో వారిద్దరూ నర్సు దగ్గరకు వెళ్లారు. ఆ సమయంలో విశాలాక్షి హాహాకారాలు చేస్తుండడం విని వెళ్లి చూడగా లోపల నుంచి మంటలు వస్తుండడంతో తలుపు తీసి చూడగా కూతురు కాలిపోతుండడాన్ని గమనించారు. విశాలాక్షి 70శాతం కాలిపోయిందని గుర్తించిన వైద్యులు బర్న్స్ వార్డుకు తరలించి ప్రత్యేక వైద్యం అందజేశారు. పరిస్థితి విషమించి శనివారం అర్ధరాత్రి మృతిచెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎడ్ల పందేలు సంప్రదాయాల్లో భాగం

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు
- వడిశలేరులో రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు


పోటీలో పాల్గొన్న ఎడ్ల బండి



సీనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే వాసు

రంగంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఎడ్ల పందేలు, కోడి పందేలు మన సంప్రదాయాల్లో, గ్రామీణ సంస్కృతిలో భాగమని, ఇవి లేకపోతే నాణ్యమైన పశుపక్ష్యాదుల సంపద అంతరించిపోతుందని, చట్టాన్ని అతిక్రమించకుండా ఇలాంటి పందేలను ఆదరించి పోషించుకోవాలని శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరు గ్రామం వద్ద గన్ని సత్యనారాయణమూర్తి స్మారక 6వ వార్షిక రాష్ట్రస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలను ఆదివారం నిర్వహించారు. పందేలను రఘురామ తిలకించి సీనియర్ విభాగంలో విజేతలైన రైతులకు బహుమతి ప్రదానం చేశారు. తండ్రి పేరిట ఈ పోటీలను ఏటా నిర్వహిస్తున్న జీఎస్ఎల్ సంస్థల ఛైర్మన్ గన్ని భాస్కరరావును ప్రశంసించారు. కాగా రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పోటీలను ప్రారంభించారు. పోటీలను క్రమం తప్పకుండా నిర్వహించడం విశేషమన్నారు. మాజీ హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ కోడి పందేలు, ఎడ్ల పందేలు లేని తెలుగు సంప్రదాయాన్ని ఊహించలేమన్నారు. జూనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గన్నిభాస్కరరావు తెలుగు సంప్రదాయాన్ని పటిష్టం చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు రౌతు సూర్యప్రకాశ్ రావు,జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

రంగంపేట/అలమూరు: వడిశలేరులో జరిగిన ఎడ్లబండ్ల పరుగు పోటీల్లో సీనియర్ విభాగం (1600 మీటర్ల దూరం)లో కోనసీమ జిల్లా గుమ్మిలేరు గ్రామానికి చెందిన కోర స్మృతిచౌదరి ఎడ్లజత మొదటి బహుమతి, అనకాపల్లి జిల్లా కేజీపురం రైతు శ్రీఆంజనేయం ఎడ్లజత రెండో బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరుకు చెందిన కోర స్మృతిచౌదరి ఎడ్ల జత మూడో బహుమతి గెలుచుకున్నాయి. జూనియర్ విభాగం(1000 మీటర్ల దూరం)లో కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వేగుళ్ల కృష్ణమాధవి ఎడ్ల జత మొదటి బహుమతి, కోనసీమ జిల్లా గుమ్మిలేరు రైతు కోర స్మృతి చౌదరి ఎడ్ల జత రెండో బహుమతి, నెల్లూరు జిల్లా గంగపట్నం గ్రామానికి చెందిన చాముండేశ్వరీ సీఫుడ్స్ ఎడ్ల జత మూడో బహుమతి గెలుచుకున్నాయి. పోటీల న్యాయనిర్ణేతలైన సూరపనేని రామకృష్ణప్రసాద్ (కృష్ణా జిల్లా), చేకూరి రామకృష్ణ (కాకినాడ)లను సత్కరించారు.

అన్నవరం దేవస్థానంలో నగదు రహిత సేవలకు మోక్షం

రెండు కౌంటర్ల ఏర్పాటు

అన్నవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నగదు రహిత సేవలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరూ ఫోన్ పే, గుగూల్ పే తదితర వాటి ద్వారా లావాదేవీలు జరుపుతున్నా అన్నవరం దేవస్థానంలో ఇప్పటివరకు అటువంటి సౌకర్యం కల్పించకపోవడంతో భక్తులు అనేక ఇబ్బందులకు గురయ్యేవారు. దీనిపై ఆంధ్రజ్యోతి, ఇతర మీడియాలలో కథనాలు వెలువడ్డాయి. ఈవో సుబ్బారావు బాధ్యతలు స్వీకరించాక భక్తుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని రిసెప్షన్ కార్యాలయం, పశ్చిమరాజగోపురం వద్ద కౌంటర్లను ఏర్పాటు చేశామని. భక్తులు వ్రతాలు, దర్శనం టిక్కెట్లు, విరాళాలు, వసతి సౌకర్యం కోసం ఇకపై డిజిటల్ పేమెంట్ల ద్వారా చెల్లింపులు చేపట్టవచ్చని దేవస్థానం అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు హుండీల లెక్కింపు

సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కామకలను సోమవారం లెక్కించనున్నట్టు అధికారులు తెలిపారు. సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఇద్దరి దాతల నుంచి రూ.2 లక్షలు విరాళంగా సమకూరాయి. కాకినాడకు చెందిన ముప్పిడి సత్యవాణి రూ.లక్ష ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్‌కు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్‌కు చెందిన కాలా కార్తికేయ దత్త రూ.1,01,116లు దేవస్థానం పీఆర్వో కృష్ణారావుకు అందించగా దాతలను అభినందించారు.


విరాళం అందజేస్తున్న దాత సత్యవాణి

పాపికొండలకు 12 బోట్లలో పర్యాటకులు


పాపికొండలకు వెళ్తున్న పర్యాటక బోట్లు

దేవీపట్నం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ ఒడ్డున ఆనుకుని ఉన్న పాపికొండల అందాలను తిలకించేందుకు పర్యాటకులు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ఆదివారం తరలివచ్చారు. పోశమ్మగండి వద్ద ఉన్న బోటు పాయింట్ నుంచి ఉదయం 12 బోట్లలో సుమారు 800 మంది పాపికొండలు తరలివెళ్లారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, మంటూరు, కొండమొదలు తదితర ముంపు గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లారు. అక్కడ శివున్ని దర్శించుకుని గిరిజనులు తయారుచేసే వెదురు వస్తువులను కొనుగోలుచేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

వెల్లివిరిసిన సృజనాత్మకత

కొండగుంటూరులో ఆకట్టుకున్న టీఎల్ఎం మేళా

దివాన్‌చెరువు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్షరాల తోట– పదాలపంట, చిట్టిబుర్రలో ఇమిడిన అక్షరమాల (అక్షర శిరోజాలు)- కూడికల యంత్రం.. టార్చిలైట్‌తో పదాల గుర్తింపు ఇలా ఒకటేమిటి వందల సంఖ్యలో ఉపాధ్యాయులు తమ సృజనాత్మకతకు పదునుపెట్టారు. వెల్లివిరిసిన సృజనాత్మకతకు లోకాస్ట్-నోకాస్ట్ సామగ్రితో రూపొందించిన బోధనోపకరణాలు ప్రతిఒక్కరినీ ఆకట్టుకున్నాయి. వైవిధ్యంగా రూపొందించిన అక్షరాల వాలుజాడ, చేప బొమ్మలతో తీసివేతలు, బొమ్మచూడు- అక్షరం పట్టు తదితర బోధనోపకరణాలకు తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని కొండగుంటూరులో జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ ఆరో దశ శిక్షణా శిబిరం ఆదివారం వేదికైంది. అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన 350 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలను ప్రత్యేక గదిలో ఉంచి మేళా నిర్వహించారు. నాలుగు జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు దాదాపు 190 వరకూ వివిధ రకాల వర్కింగ్ మోడల్స్‌ను రూపొందించారు. టీఎల్ఎం మేళా విజ్ఞాన మార్పిడి కేంద్రంగా మారిందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి చతుర్విధ ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు రంగంపేట మండలం సింగంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, శిక్షణా శిబిరం కేఆర్‌పీ సీహెచ్ గౌతమ్‌కృష్ణ రూపొందించిన గణిత రోబో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కూడికలు, తీసివేతలు, భాగాహారం, గుణకారం ప్రక్రియను విద్యార్థులకు సులభంగా ఉపాధ్యాయులు నేర్పడానికి, విద్యార్థులు నేర్చుకోవడానికి కూడా ఉపకరిస్తుందని శిక్షణా కేంద్రం కోర్స్ కోఆర్డినేటర్ ఎం.రాంబాబు తెలిపారు. ఈ శిక్షణా తరగతులు మంగళవారం ముగుస్తాయని తెలిపారు. ఈ రోబోను అట్టముక్కలతోవారం రోజుల్లో తయారు చేసినట్టు గౌతమ్‌కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సీహెచ్‌వీ సోమిరెడ్డి, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ అనూష, కేఆర్‌పీ కె.ఈశ్వరరావు, డీఆర్పీలు ఉన్నారు.


గణితరోబో,అక్షరశిరోజాల దృశ్యాలు

ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు ప్రణాళిక నిత్య నూతనం అని సీపీఎం నాయకుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. సీపీఎం పార్టీ తూర్పుగోదావరి జిల్లా మహాసభల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన ప్రతినిధుల సభలో అరుణపతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు ప్రణాళిక దిక్సూచి వంటిదన్నారు. దేశం, రాష్ట్రంలో కుల, వర్గ, మతం వంటి సామాజిక విభజన ఉన్నప్పటికీ కమ్యూనిస్టులను అందరూ స్వాగతిస్తారన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ కవులు, కళాకారులకు పుట్టినిల్లయిన రాజమహేంద్రి అభ్యుదయ, సాంఘిక ఉద్యమాలకు వేదిక అన్నారు. సభలో నివేదికను జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు, పి.తులసి, సుందరబాబు, బేబీరాణి, ఎస్.రాజా, ఎస్ఎస్.మూర్తి, పోలిన వెంకటేశ్వరరావు, టీఎస్.ప్రకాష్, కె.రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాబూరావు

కబడ్డీ పోటీలకు ఎంపిక


రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జనవరి 3, 4, 5 తేదీల్లో జరగబోయే 50వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్ల ఎంపికలు ఆదివారం నిర్వహించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడామైదానంలోని కబడ్డీ గ్రౌండులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. మండల సూర్యనారాయణ, యశ్వంత్, జిల్లా పీడీలు, పీఈటీల అసోసియేషన్ సెక్రటరీ ఎస్.నాగరాజు తదితరులు ఉన్నారు.

ఎస్.యానాంలో హోరాహోరీగా...

ముగిసిన మహిళల బీచ్ వాలీబాల్ పోటీలు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఉప్పలగుప్తం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నేషనల్ మహిళల బీచ్ వాలీబాల్ పోటీల ఫైనల్స్ ఆదివారం హోరాహోరీగా జరిగాయి. తమిళనాడు, వేల్స్ యూనివర్సిటీ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఈ మ్యాచ్‌లో వేల్స్ జట్టుపై తమిళనాడు జట్టు 27-25, 22-20, 15-17 సెట్ల తేడాతో విజయం సాధించింది. పాయింట్ల పట్టికలో టాప్4లో తమిళనాడు, వేల్స్ యూనివర్సిటీ, ఆంధ్రా, పుదుచ్చేరి జట్లు నిలిచాయి. ఆంధ్రా, పుదుచ్చేరి జట్లు తలపడగా పుదుచ్చేరి జట్టు విజయం సాధించి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలకు మహిళలకు అధిక సంఖ్యలో హాజరుకావడం విశేషం. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో జరిగిన ఈపోటీలను కొత్తపేట, పి.గన్నవరం, ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, అమలాపురం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ఛైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, కూటమి నాయకులు అరిగెల నానాజీ, దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ తిలకించారు. వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం ఆధ్వర్యంలో టోర్నీ కార్య నిర్వాహక కార్యదర్శి గోలకోటి ఫణీంద్రకుమార్ పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో 33మంది పీడీలు టోర్నీ విజయవంతానికి కృషి చేశారు. టోర్నీ విజయవంతానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఆనందరావు ను సహచర ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు, క్రీడాకారులు సన్మానించారు. ఎస్.యానాం సర్పంచ్ జోగి రాజేశ్వరిరాజా, వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లంకే రాజా, సంయుక్త కార్యదర్శి అయితాబత్తుల అజయ్‌సింగ్, వాటర్ డీసీ ఛైర్మన్ దంగేటి చిట్టిబాబు, సత్తి చిన్నా తదితరులున్నారు.


విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యేలు అయితాబత్తుల, గిడ్డి

వేట్లపాలెంలో అధికారుల పర్యటన

సామర్లకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం దళితవాడలలో ఆదివారం కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు తదితర రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంయుక్తంగా పర్యటించారు. ఈనెల 15న ఒకే సామాజిక వర్గానికి చెందిన 2 కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా కత్తులతో ఒక కుటుంబం దాడులు చేసి ముగ్గురిని హతమార్చిన విషయం విదితమే. దీంతో గ్రామంలో ఆదివారం పోలీసు అధికారులతో కలిసి ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించి బాధిత కుటుంబాలకు మానసిక ధైర్యం అందించారు. ఆర్డీవో మల్లిబాబు, డీఎస్పీ శ్రీహరిరాజు ఇరు కుటుంబాలకు చెందిన వ్యక్తులతో చర్చించి గ్రామంలో శాంతికి సహకరించాలని కోరారు. ఇంకా ఈ సంఘటనలో పాల్గొన్న పలువురిని ఇంకా అరెస్ట్ చేయాల్సి ఉందని చెప్పగా త్వరలో నే అరెస్ట్ చేస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రావులపాలెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడులో తాళం వేసిన ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి తాళాలు పగలుకొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడు శనగన ధర్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఏడాది కాలం నుంచి స్థానిక శివాలయం వీధిలో అద్దె ఇంట్లో ధర్మయ్య నివసిస్తున్నాడు. ఈనెల 25వ తేదీన గోకవరంలో బంధువుల ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి ఆదివారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలు కొట్టి ఉన్నాయి. లోపలకి వెళ్లి పరిశీలించగా బీరువా పగులకొట్టి అందులోని 20 తులాల వెండి వస్తువులు, 4 కాసుల బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదు చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ చంటి సిబ్బందితో వెళ్లి వివరాలు నమోదు చేసుకుని కేసు నమోదు చేశారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించారు.

11న హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ మహాసభ

పిఠాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ పంచమ మహాసభ పిఠాపురం అగ్రహారంలో గల అనఘా దత్త క్షేత్ర ఆడిటోరియంలో జనవరి 11న జరగనుంది ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, యానాం (పాండిచ్చేరి) నుంచి ప్రతినిధులు హాజరు కానున్నారు. ఈ సభల్లోనే జాతీయ, రాష్ట్ర కార్యవర్గాల ఎన్నిక జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. కమలానంద భారతి స్వామి ఆశీస్సులతో నిర్వహించే ఈ సభలో ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద భారతి స్వామి, మైసూరుకు చెందిన వేద పండితుడు కర్రి సంతోష్‌కుమార్ ఘనాపాఠీ, హిందూ ధర్మ రక్ష సమితి అధ్యక్షుడు చేదులూరి గవరయ్య, ఆంధ్ర, తెలంగాణ శివశక్తి ప్రతినిధి చాట్లపల్లి కల్యాణ్‌కుమార్, సీనియర్ న్యాయవాది వజ్రాల చంద్రశేఖర్, ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్ పాల్గొంటారని వారు వివరించారు.



విద్యార్థికి బుక్‌లెట్ అందజేస్తున్న నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు

ఏకాగ్రతతో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలి

కాకినాడ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత శాతం సాధించాలని రాష్ట్ర నైతిక విలువల ప్రభుత్వ సలహాదారు, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యుపీఈఐఎఫ్) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కాకినాడ కుళాయిచెరువు ప్రాంగణంలోని రాగిరెడ్డి కళాక్షేత్రంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ చాగంటి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఎటువంటి ఆకర్షణలకు లోనుకాకుండా తల్లిదండ్రుల పట్ల గౌరవభావంతో మెలుగుతూ వారి కర్తవ్యాన్ని నిర్వర్తించాలన్నారు. ఎంఎస్ నారాయణ జూనియర్ కాలేజీ యాజమాన్యం రూపొందించిన పదో తరగతి ప్రశ్నపత్రాల బుక్‌లెట్‌లను విద్యార్థులకు చాగంటి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఛైర్మన్ దాసరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి సురేష్, కార్యదర్శి సుబ్బాన్, ఫెడరేషన్ ఫౌండర్, లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్, ఇతర కరస్పాండెంట్లు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

'క్రియ' పోటీల్లో కరప విద్యార్థుల ప్రతిభ

కరప, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలో జరిగిన క్రియ పోటీల్లో కరప హైస్కూలు విద్యార్థుల ప్రతిభ చాటారని హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఏకపాత్రాభినయంలో ఎస్.గాండీవశృతివెన్నెల (కన్సొలేషన్ బహుమతి), క్రాఫ్ట్ మోడల్‌లో పి.అలేఖ్య (స్టేట్ ఫస్ట్), డ్రాయింగ్‌లో ఆర్.నాగదేవిశ్రీ (మూడోస్థానం) సాధించారు. విజేతలను, వారికి తర్ఫీదు ఇచ్చిన గణిత ఉపాధ్యాయుడు టేకుమూడి శ్రీనివాస్, డ్రాయింగ్ టీచర్ వై.కుసుమలను హెచ్ఎం, ఉపాధ్యాయులు స్వర్ణరాణి, ఎం.రమేష్ రామమోహన్, ప్రసాద్‌కుమార్, భారతి, సుదర్శనబాబు, ఎస్ఎంసీ ఛైర్మన్ డి.దుర్గారావు అభినందించారు.



ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

కాకినాడ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీసాయి రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి అల్ట్రాసౌండ్, రక్త, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేశారు. శిబిరాన్ని శ్రీసాయి రాఘవేంద్ర సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత, టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర సభ్యుడు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ పర్యవేక్షించారు. డాక్టర్ కొండమూరి, డాక్టర్ అంగర రుక్మిణీ రమ్య సుమారు 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. టీడీపీ నగర కమిటీ కన్వీనర్ వనమాడి మోహనవర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్లాస్టిక్ అనీమియా వ్యాధితో బాధపడుతున్న బాలుడికి రూ.25 లక్షలు ఖర్చు అయ్యే బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ వైద్యం నిమిత్తం కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకు విన్నవించనున్నట్టు శిబిరం చీఫ్ ఆర్గనైజర్ మీడియాకు తెలిపారు.



వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ కొండమూరి సత్యనారాయణ

పెద్దాపురప్పాడు హైస్కూల్ డైమండ్ జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు

కరప, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురప్పాడులో బీరుదా సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా డైమండ్ జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బొండా చంటిబాబు తెలిపారు. పెద్దాపురప్పాడులో ఆదివారం ఆయన అధ్యక్షతన పూర్వ విద్యార్థులు సమావేశమై డైమండ్ జూబ్లీ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, ఏర్పాట్లపై సమీక్షించారు. ఫైనాన్స్, సావనీర్, నిర్వహణ, తదితర కమిటీలను ఏర్పాటుచేసి వారికి దిశానిర్దేశం చేశారు. వచ్చే ఏప్రిల్‌లో డైమండ్ జూబ్లీని అట్టహాసంగా నిర్వహిస్తామని చెప్పారు.

సమావేశంలో పూర్వ విద్యార్థులు అయిరెడ్డి సత్యనారాయణ, నల్లా సత్యనారాయణ, గొల్లపల్లి లక్ష్మణరావు, చిక్కం రామచంద్రరావు, యాళ్ల కృష్ణారావు, దేవు సదానందమూర్తి, తాడి మాచారెడ్డి, యర్రంశెట్టి కొండ తదితరులు పాల్గొన్నారు.

మహారాణి డిగ్రీ కళాశాల విద్యార్థుల అ'పూర్వ' కలయిక

పెద్దాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహారాణి డిగ్రీ కళాశాలలో 1993-1998 సంవత్సరాల మధ్య చదువుకున్న విద్యార్థుల అపూర్వ కలయిక స్థానిక వైభవ్ లే-అవుట్‌లో ఆదివారం జరిగింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవడంతో ఎంతో ఆనందంగా గడిపారు. అనంతరం విందు భోజనాలు చేశారు. మాజీ జడ్పీటీసీ సుందరపల్లి శివనాగరాజు, డాక్టర్ దాదాజీ, సూరిబాబు, సత్యం, సుబ్బు ప్రశాంత, ప్రసన్న, లత, బాల పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

'క్యాన్సర్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి'

గొల్లప్రోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ సూచించారు. గొల్లప్రోలు పట్టణంలోని సురేష్ కల్యాణ మండపంలో కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (పీఎంపీ) అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీ పీఎంపీ క్యాన్సర్ లక్షణాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. దంత వైద్య నిపుణురాలు డాక్టర్ వసుధ మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులు, ధూమపానం, మద్యపానం వల్ల ఎక్కువగా నోటి కేన్సర్‌కు గురవుతున్నారన్నారు. క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే చికిత్స సులువన్నారు. మండల శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారు కోన చిన్నారావు, జిల్లా కార్యదర్శి ఎండీ ఆనీషా, మడకా సత్యనారాయణ, గిడుతూరి సురేష్, రంధి కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా జరుపుకుందాం'

గొల్లప్రోలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో సంప్రదాయబద్ధంగా జరుపుకుందామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ కోడిపందేలు, గుండాట, పేకాట, జూదాలు, బెట్టింగ్‌లు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవడమే గాక కేసులు ఎదుర్కోవలసి ఉంటుందని తెలిపారు. పండుగ సందర్భంగా ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. డిజిటల్ అరెస్టు అనేది లేదని, ఇటువంటి వాటిపై ఎటువంటి కాల్స్ లేదా మెసేజ్‌లు వచ్చినా నమ్మవద్దన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులు చేసే కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. సదస్సులో గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు 'పర్యావరణ కవి' పురస్కారం

తాళ్లరేవు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో మండలంలోని కోరింగ పంచాయతీ సీతారామపురం గ్రామానికి చెందిన యువ రచయిత పినపోతు వెంకటేశ్వరరావు పర్యావరణాన్ని కాపాడుకుందాం అంశంలో 'ఇకనైనా మేలుకో' కవితా గానం చేశారు. ఈ కవితకు పర్యావరణ కవి పురస్కారంతో పాటు ప్రథమ బహుమతిని హైకోర్టు జడ్జి యు.దుర్గాప్రసాదరావు నుంచి వెంకటేశ్వరరావు అందుకున్నారు. తాళ్లరేవు మండలం గుమ్మళ్లపేట ఎంపీపీ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఈయన్ను సహచర ఉపాధ్యాయులు, గ్రామాల పెద్దలు అభినందించారు.





పిఠాపురం శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన వెంకటేశ్వరరావు, గొల్లప్రోలు మండల శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన సింహాద్రిలను అభినందిస్తున్న నాయకులు

బీజేపీ మండల శాఖల అధ్యక్షులు వీరే

పిఠాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ స్థాయి నుంచే పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని బీజేపీ జిల్లా నాయకులు సూచించారు. సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం చెలికాని భావనరావు సభా సదన్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో బీజేపీ పిఠాపురం పట్టణ కమిటీ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా ఓలేటి వెంకటేశ్వరరావు ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి రవణం సుబ్రహ్మణ్యం ప్రకటించారు. వెంకటేశ్వరరావును బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట్ల సూర్యనారాయణరాజు, పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, వనువులేటి సత్యనారాయణ, బుర్రి మురళీధరరావు, వానంశెట్టి శ్రీనివాస్, పిల్లా ముత్యాలరావు, దోనే అమృతరామయ్య అభినందించారు.



పెద్దాపురం మండల శాఖ అధ్యక్షుడిగా ఎన్నికైన వీరప్రభాకరరావును అభినందిస్తున్న బీజేపీ నేతలు

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): బీజేపీ గొల్లప్రోలు మండల శాఖ అధ్యక్షుడిగా కె.సింహాద్రి ఎన్నికయ్యారు. చేబ్రోలులో ఎన్నికల రిటర్నింగ్ అధికారి బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ఎన్నికను ప్రకటించారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): బీజేపీ పెద్దాపురం మండల శాఖ అధ్యక్షుడిగా పోతుల వీర ప్రభాకరరావు ఎన్నికయ్యారు. ఎన్నిక ప్రక్రియను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు తుమ్మల పద్మజ సమక్షంలో మండలంలోని వడ్లమూరు వివేకానంద ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. నేతలు పెన్నాడ జగన్నాథం, పెదిరెడ్డి రవికిరణ్, మొయిళ్ల రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): బీజేపీ పెదపూడి మండల అధ్యక్ష ప్రతినిధి ఎన్నికలను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారి కురగంటి సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా ముమ్మిడి శివ ఎన్నికయ్యారు. ఆయనకు రామకృష్ణారెడ్డి, సతీష్, బీజేపీ అనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శివరామకృష్ణంరాజు అభినందనలు తెలిపారు.

రేపు పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు కమిషనరు కేవీ పద్మావతి తెలిపారు. ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతుందని చెప్పారు.

వచ్చే నెల 24 నుంచి క్రెడయ్ హోం ఎక్స్‌పో

కాకినాడ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహిస్తున్న హోం ఎక్స్‌పో ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని క్రెడయ్ కాకినాడ శాఖ అధ్యక్షుడు కె.విజయకృష్ణ పేర్కొన్నారు. స్థానిక సరోవర్ పోర్టికో సమావేశ మందిరంలో ఆదివారం క్రెడయ్ రెండవ కార్యవర్గ సమావేశం జరిగింది. విజయకృష్ణ మాట్లాడుతూ జనవరి 24 నుంచి 26 వరకు కాకినాడలో ఆరవ క్రెడయ్ హోం ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఛైర్మన్ నెక్కంటి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి టీడీ రమణారావు, కోశాధికారి పురం రాంబాబు, ఉపాధ్యక్షులు చక్రధరరావు, బసవ ప్రసాద్, దేవత శేఖర్, సంయుక్త కార్యదర్శి పాటోలు చిన్నపన్నయ్య, కార్యదర్శి సుంకర సురేష్, కార్యవర్గ సభ్యులు దేవరకొండ విజయ్‌కుమార్, వెత్సా ఆనంద్, నల్లి రాంబాబు, ముద్రగడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

'కంచిరాజు సేవలు ఎనలేనివి'

కరప, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరప మాజీ సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు చాగంటి కంచిరాజు సేవలు ఎనలేనివని శివగంగ రజక సంఘం అధ్యక్షుడు మురమళ్ల నాగేశ్వరరావు కొనియాడారు. కంచిరాజు 17వ వర్ధంతి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ నాయకులు కాకినాడ ఈశ్వరరావు, మంచాల శ్రీనివాస్, సైనవరపు వీర వెంకటరమణ, సతీష్, భవానీశంకర్, పంపులు, జాన్‌రాజు, సూరిబాబు, ఆదిబాబు, నూకరాజు, చిన్నఅప్పారావు, సత్తిబాబు, చిన్నారావు, శివ, తదితరులు పాల్గొన్నారు.



భోగి మంట వెలిగిస్తున్న మహిళలు

సంక్రాంతి సంబరాలు

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీనగర్‌లో గల క్షత్రియ పరిషత్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించామని క్షత్రియ మహిళా విభాగం అధ్యక్షురాలు పార్వతి, కార్యదర్శి దేవివర్మ తెలిపారు. మహిళలు గొబ్బెమ్మలు, రంగవల్లులు, భోగి మంటలు వేసి అలరించారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. కోడిపందాలు ఆకట్టుకున్నాయి. మహిళలు ఏర్పాటుచేసిన వ్యాపార సముదాయ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కార్పొరేషన్ (కాకినాడ), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కార్పొరేషన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ భావన తెలిపారు. నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఉదయం 9.30 గంటల నుంచి డయల్ యువర్ కమిషనర్, పది నుంచి ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామని చెప్పారు.

గోవమ్మ తల్లికి ప్రభుత్వ విప్ 'దాట్ల' పూజలు

తాళ్లరేవు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): దాట్ల సుబ్బరాజు ఎమ్మెల్యేగా గెలిస్తే పూజలు చేసి భోజనాలు పెట్టుకుంటామని చినవలసల టీడీపీ కార్యకర్త పాలెపు గోవరాజు-మంగ దంపతులు గాడిమొగ పంచాయతీ బాబానగర్ గ్రామంలో వేంచేసిన శ్రీగోవమ్మ తల్లికి మొక్కుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అమ్మవారికి మేకపోతులు సమర్పించి కార్యకర్తలకు భోజనాలు పెట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు గోవమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాపూరి సూర్యాకాంతం, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, పైడాడి శ్రీనివాసరావు, నంగాడి కామేశ్వరరావు, మల్లాడి వరదరాజు, సీతారామరాజు, నంగాడి అగ్గిరాముడు, కాపూరి సత్తిబాబు పాల్గొన్నారు.



గోవమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే

ఘనంగా బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు వార్షికోత్సవం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, పద్మశ్రీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగు ప్రధాన ఐ బ్యాంకుల్లో బాదం బాలకృష్ణ ఐ బ్యాంకు కీలకమైనదన్నారు. ఐ బ్యాంకు ద్వారా చూపు పొందిన వారిని అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐ బ్యాంకు ఛైర్‌పర్సన్ డాక్టర్ దామెర విజయలక్ష్మి, సెక్రటరీ డాక్టర్ బాదం బాలకృష్ణ, కోశాధికారి దాసరి సాయికృష్ణ, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రావుల రమ్య, ట్రస్టీలు శీమకుర్తి పాపారావు, డాక్టర్ రావుల శ్రీరామ్, చెలికాని వెంకట సూర్యారావు, ఎం.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఐ బ్యాంకు ద్వారా చూపు పొందిన వారిని అభినందిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్, బాలకృష్ణ

వాడబలిజ మత్స్యకార సంక్షేమ సంఘం నూతన కార్యవర్గమిదే

కాకినాడ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగర వాడబలిజ మత్స్యకార సంక్షేమ సంఘం సమావేశాన్ని ఆదివారం జగన్నాథపురంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. అతిథులుగా విచ్చేసిన సంఘ నేతలు కర్రి నారాయణరావు, చోడిపల్లి సత్యప్రసాద్, చవ్వాకుల రాంబాబు, దోనే చిట్టిబాబు, పప్పు లక్ష్మారావు సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీలపల్లి కామరాజు, గౌరవ అధ్యక్షుడిగా బడే గోవిందరావు, గౌరవ ఉపాధ్యక్షుడిగా వరివల్లి శివాజీ, ఉపాధ్యక్షులుగా చొక్కా నానాజీ, గంపల కళ్యాణ్, కార్యదర్శిగా గరికిన సతీష్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా కొంద్రు దుర్గాప్రసాద్, కోశాధికారిగా దోడా సత్యానందరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం అతిథులను శాలువాలతో, నూతన కార్యవర్గాన్ని పూలదండలతో సత్కరించారు.



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న అతిథులు

విద్యుత్ చార్జీల పెంపు భారం జగన్‌దే

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

సామర్లకోట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో జగన్ అవినీతి వల్లే రాష్ట్ర ప్రజల నెత్తిన రూ.1,29,000 కోట్ల మేర విద్యుత్ భారం పడిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప నిశితంగా విమర్శించారు. మండలంలోని అచ్చంపేటలో గల తన స్వగృహంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడారు. మీరే చార్జీలు పెంచి మీరే ధర్నాలు చేయడం ప్రజలను నిలువెల్లా మోసం చేయడం కాదా అని వైసీపీ నేతలను సూటిగా ప్రశ్నించారు. పోలవరం జల విద్యుత్ ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి తగ్గిపోవడానికి విజయసాయిరెడ్డి సరఫరా చేసిన నాసి రకమైన బొగ్గు కారణమన్నారు. నేడు రాష్ట్రంలోని 20వేల మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్లు నాడు చంద్రబాబు పాలనలో నిర్మించినవేనని గుర్తుచేశారు. అందువల్లే రైతులకు ఉచితంగా, ఆక్వా రైతులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ ఇవ్వగలుగుతున్నామని చినరాజప్ప చెప్పారు.



పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి: సీపీఎం

కొత్తపల్లి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం కొత్తపల్లి మండల శాఖ సమావేశం డిమాండ్ చేసింది. నాగులాపల్లిలో ఆదివారం జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబీరాణి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. 'కొత్త సంవత్సరంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరం కదులుదాం' కరపత్రాలను విడుదల చేశారు. నాగులాపల్లి శాఖ కార్యదర్శి కాళ్ల నాగేశ్వరరావు, జి.వెంకటసుబ్బిరెడ్డి, నారాయణరెడ్డి, మోషే, కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైఖానస సంఘానికి వంట సామగ్రి బహూకరణ

పిఠాపురం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఖానస సంఘానికి హైదరాబాద్‌కు చెందిన నాగాభట్ల వెంకటరమణ, ఆమె కుమారుడు సీతారామమూర్తి దంపతులు రూ.50వేలు విలువైన వంట సామగ్రి, రోళ్లు, రోకలి, పెళ్లి పీట బహూకరించారు. పిఠాపురం పట్టణానికి చెందిన నంద గోపాలకృష్ణ-నాగమణి దంపతులు రూ.10వేలు విలువైన భోజనం బల్లలు అందజేశారని సంఘ సభ్యుడు పెద్దింటి విజయజనార్దనాచార్యులు తెలిపారు.

'భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ విశిష్టత'

కాకినాడ సిటీ, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వమే భారతీయ విశిష్టత అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జి.బేబీరాణి పేర్కొన్నారు. 'గడప లోపలే మతం-గడప దాటితే భారతీయులం' నినాదంతో సీపీఎం రాష్ట్ర కమిటీ రూపొందించిన కరపత్రాన్ని కచేరీపేట వెంకటేశ్వరకాలనీ కూడలిలో ఆదివారం ఆమె ఆవిష్కరించారు.



మరిడమ్మకు బంగారు హారం సమర్పణ

పెద్దాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం మరిడమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన పడాల దుర్గారావు, లింగం సాయిచరణ్ రూ.1.50 లక్షలతో 16.300 మిల్లీ గ్రాముల బంగారు హారం బహూకరించినట్టు సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి తెలిపారు. దాతలకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదాశీర్వచనం, ప్రసాదాలు అందజేశారు.



కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కుటేశునికి అభిషేకాలు

పిఠాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసియున్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామికి మాసశివరాత్రి సందర్భంగా ఆదివారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరీ దేవి, పురుహూతికా అమ్మవార్లకు కుంకుమార్చన జరిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వారికి అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పుష్పాలంకరణలో ఉమారామలింగేశ్వర స్వామి

ఏకాదశ రుద్రాభిషేకం

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఆదివారం మాసశివరాత్రి సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకవార, ఏకాదశ ద్రవ్య రుద్రాభిషేకాలను అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పలు రకాల పుష్పాలతో అలంకరించి నవహారతులు ఇచ్చారు. ఆలయ సేవా సమితి సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.



భార్గవ్‌ను అభినందిస్తున్న డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ

శభాష్ భార్గవ్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రియ పిల్లల పండుగలో ఆశ్రమ్ స్కూలు పదో తరగతి విద్యార్థి పుణ్యాల భార్గవ్ గిడుగు రామమూర్తి పంతులు ఏకపాత్రాభినయంతో ఆకట్టుకున్నాడు. తేనెలొలికే తెలుగు సాహిత్యంతో, చక్కని ఉచ్చారణతో గొప్ప పండితుడు, కవి, మంచి వక్తలా భార్గవ్ గిడుగు పాత్రలో ఆకట్టుకున్నాడని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు, విశ్రాంత ఐఏఎస్ డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ కితాబిచ్చారు. అతడికి నగదు పారితోషికం అందజేశారు. అవకాశాలు కల్పిస్తే విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తారనేందుకు ఈ కుర్రాడే నిదర్శనమన్నారు.

కోడిపందాల శిబిరాల ఏరియాలను పరిశీలించిన సీఐ

జగ్గంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మామిడాడ గ్రామం శివారులో కోడిపందాలు ఆడే అవకాశం ఉన్న ఏరియాలను జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. చుట్టుప్రక్కల ఎవరూ ఆడిస్తున్నారు, కత్తులు కట్టేవారు ఎవరు అని ఆరా తీసి, ఎవరైనా జూదాలు ఆడితే 100, 94407 96529కు సంప్రదించాలన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

మోతుగూడెం పరిసరాల్లో 'నది' షూటింగ్ సందడి



నది సినిమా హీరో మహర్షి ఉద్యా

మోతుగూడెం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న వీఆర్‌పురం, కూనవరం, చింతూరు, ఎటపాకలలో 'నది' సినిమా షూటింగ్ సందడి చేస్తున్నారు. నది సినిమా హీరో మహర్షి ఉద్యా. ఈయన గతంలో మజిలీ, నేలటిక్కెట్, భీమ్లానాయక్, ఆకాశవాణి, గద్దలకొండ గణేష్ తదితర సినిమాల్లో నటించారు. ఈయన కన్నడంలో నటించారు. ఇప్పుడు నది సినిమా నాలుగు మండలాల్లో చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాలో మెయిన్ రోల్‌గా నాజర్, నవిత దాస్ నటిస్తున్నారు. డైరెక్టర్ ఆదిత్య వెంపటి, నిర్మాత బ్రీడన్ జెనిట కృష్ణ, మామిడి బత్తుల బ్యానర్ ఆవలో కోటేశ్వర ఫిల్మ్‌లో ఈ షూటింగ్ చేసేందుకు చుట్టుప్రక్కల గ్రామ ప్రజలు వచ్చారు.

ఇంటి నిర్మాణం కలేనా...?

• ప్రభుత్వాలు మారినా గిరిజనుల సొంతింటి కలపై ఆంక్షలు



బిల్లులు కాక బరదనాంపల్లి పంచాయతీలో బేస్‌మెంట్‌లోనే నిలిచిపోయిన ఇల్లు

రాజవొమ్మంగి డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ సంస్థ ద్వారా గిరిజనులు సొంతం గా నిర్మించుకునే ఇళ్ల నిర్మాణాలపై కొందరి అధికారుల తీరువల్ల సొంతింటి కల కలగానే మారింది. ప్రభుత్వాలు మారినా ఆదివాసీలకు ప్రభుత్వాలు మంజూరు చేసే ఇళ్లకు బిల్లులు కాక ఇంటి నిర్మాణ ఆలోచననే గిరిజనులు మానుకుంటున్నారు. గృహనిర్మాణ సంస్థ ద్వారా పీఎం జన్‌మన్ 2023-24,2024-25లో రాజవొమ్మంగి మండలంలో 412 మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా, ఆ ఇళ్లకు బిల్లులు చేసేందుకు ఆర్డర్ షీట్ జనరేషన్ సమయంలో 131 మంది పేర్లు రాక సుమారు 95లక్షల రూపాయలు బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. కేవలం రాజవొమ్మంగి మండలంలోనే సుమారు కోటి రూపాయలు బిల్లులు చేసేందుకు అవకాశం లేకపోవడం, గతంలో హౌసింగ్ ద్వారా 2016నుంచి 2020 వరకు మండలంలో ఇళ్లు నిర్మించుకున్న గిరిజనులలో 120 మందికి నేటికీ బిల్లులు కాక సుమారు 50లక్షల రూపాయల బిల్లులు లబ్ధిదారులకు అందలేదు. దీంతో మండలంలో ప్రభుత్వ హౌసింగ్ మంజూరు ద్వారా ఇళ్ల నిర్మాణం అందని ద్రాక్షగా మారుతుందని గిరిజనులు అభిప్రాయపడుతున్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే లబ్ధిదారుల ఖాతాలలో సొమ్ములు జమచేసేల చర్యలు చేపట్టాలని కోరారు.

ఎటపాకలో ఇసుక నిల్వలు సీజ్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇసుక నిల్వలు సీజ్ చేస్తున్న తహసీల్దార్, సీఐ

ఎటపాక, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎటపాకలో ఇటుకబట్టీల వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను ఆదివారం రెవెన్యూ, పోలీసు అధికారులు సీజ్‌చేసి, స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో ఎటపాక, చెన్నంపేట గోదావరినదీ పరివాహక ప్రాంతం నుంచి సాగుతున్న ఇసుక దందాపై వెలువడిన ఇసుక బకాసురుల వార్తా కథనానికి అధికారులు స్పందించారు. దాంతో తహసీల్దార్ కారం సుబ్బారావు, సీఐ కన్నపరాజు ఇసుక నిల్వల ప్రదేశం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇటుక బట్టీ పక్కన సుమారు నాలుగు ట్రాక్టర్ల అక్రమ ఇసుక నిల్వలను గుర్తించారు. స్థానికులు కొందరు నిల్వలు ఇసుక తమదేనని, ఇటుక బట్టీల వినియోగానికి తెచ్చుకున్నటు అధికారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఈ ఇసుక తెచ్చు కొనేందుకు అనుమతులు తీసుకున్నారా అని ప్రశ్నించారు. అనుమతులు లేకపోవడంతో వెంటనే ఇసుకను సీజ్‌చేసి స్వాధీనం చేసుకున్నారు.

నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలుపుదల



మురారి జాతీయరహదారిపై నిలిపివేసిన వాహనాలు

గండేపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఈ మధ్య కాలంలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు ఆగి ఉన్న వాహనాలను వెనుక నుంచి ఢీకొట్టం వల్లే జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలకు కారణం జాతీయ రహదారిపై నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలు నిలుపుదల చేయడమే కారణం. మండలంలో మురారి నుంచి నీలాద్రిరావుపేట వరకు జిల్లాలో ఎక్కడాలేని విధంగా సుమారు 19 కిలో మీటర్లకు పైగా రహదారి ఉంది. ఈ రహదారిని ఆనుకుని ఉన్న హోటళ్ళ, దాబా రెస్టారెంట్ల వద్ద వాహనదారులు ఇష్టానుసారంగా అనధికార ప్రదేశాల్లో నిలిపివేస్తున్నారని దీంతో వెనుక వచ్చిన వాహనాలు వాటిని ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. రాత్రి వేళల్లో అయితే ఈ వాహనాలు నిలుపుదల చేయడంవల్ల ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. అనధికార ప్రదేశాల్లో వాహనాలు నిలపకుండా అధికారులు చర్యలు తీసుకుంటే ప్రమాదాల నివారణ చేయవచ్చని పలువురు చెబుతున్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు

• గ్రామాల్లో సగానికిపైగా పూర్తయిన సీసీ రోడ్లు నిర్మాణం

గండేపల్లి, డిసెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో ఐదు సంవత్సరాల్లో కూడా గ్రామంలో రోడ్లను గాలికొదిలేయడంతో వాటి దుస్థితి అధ్వానంగా మారిన విషయం తెలిసిందే. దీంతో గ్రామస్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఆరునెలల కాలంలో రోడ్ల పరిస్థితిపై దృష్టిపెట్టడంతో పనులు చకచకా జరుగుతున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో సుమారు రూ.20కోట్లకుపైగా సీసీ రోడ్లు, తారు రోడ్లు, డ్రైనేజీలకు నిధులు మంజూరయ్యాయి. గండేపల్లి మండలానికి సుమారు రూ.5కోట్లకు పైగా నిధులు మంజూరు కావడంతో గ్రామాల్లో ఇప్పటికే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే సగానికిపైగా రోడ్లు నిర్మాణ పనులు పూర్తయినట్లు పంచాయతీరాజ్ జేఈ కె.నారాయణ చెబుతున్నారు. సంక్రాంతి కల్లా పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టేందుకు నియోజకవర్గ నాయకుల సహకారంతో అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. మురారి గుబ్బాలమ్మగుడి నుంచి హైస్కూల్ వరకు సీసీ రోడ్లు, డ్రైన్లకు రూ.1.50కోట్లతో పనులు ఉపసర్పంచ్ జాస్తి వసంత్ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. నాయకంపల్లి, యల్లమిల్లి, తాళ్ళూరు నుంచి యల్లమిల్లి గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.



గత ప్రభుత్వంలో సింగరంపాలెం వెళ్లే రహదారి దుస్థితి

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

జాగా ఉందా... పాగా వేసేయ్

• రహదారులు,ఫుట్‌పాత్‌ల ఆక్రమణ • పట్టించుకోని పురపాలక అధికారులు



తుని సీఎంఆర్ సెంటర్‌లో నిబంధనలకు విరుద్ధంగా పుట్‌పాతిలు తొలగించి షాపులకు ర్యాంపు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

తునిరూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో రహదారుల ఆక్రమణలు రోజురోజుకు అధికమవుతున్నాయి. దీంతో పాటు ఫుట్‌పాత్‌లు సైతం యథేచ్ఛగా ఆక్ర మణలకు గురవుతున్నాయి. ఫలితంగా పట్టణ వాసులు నడిచేందుకు వీలు లేకుండా పోతుంది. పలువురు ఫుట్‌పాత్‌లను తొలగించి వ్యాపార అవసరాలకు వినియోగించుకుంటున్నారు. గత కొంతకాలంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో అనధికారికంగా దుకాణాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. తాండవ నదీ తీరం ఆనుకుని నిర్మాణాలు, పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఐటీవల ఏర్పడిన ఒకషాపు, ఎల్ ఐసీ బిల్డింగ్ ఎదురుగా పక్కన వెలిసిన దుకాణాలు, రైతుబజార్ సమీపంలో పలు ప్రాంతాల్లో రహదారుల ఫుట్‌పాత్‌లు పెద్దఎ త్తున ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుంది. రోడ్డుకి ఇరువైపులా గల ఫుట్‌పాత్‌లపై ఏకంగా దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చేస్తున్నారు. తుని పట్టణంలో ఈ పరిస్థితి నెలకొన్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రధాన కూడలిలో ఉన్న సీఎంఆర్ సెంటర్లో నూతనంగా ఏర్పాటవుతున్న పలు షాపుల నిర్వాహకులు ఏకంగా ఫుట్‌పాత్‌లను తొలగించి షాపులకు మార్గాన్ని ఏర్పా టు చేసుకోవడం పలువిమర్శలకు తావిస్తోంది.

టీడీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి

• టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న యనమల రామకృష్ణుడు

తునిరూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి సమిష్టిగా కృషిచేయాలని టీడీపీ సీనియర్ నేత పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తొండంగి మండలానికి చెందిన పలువురు వైసీపీ కీలక నాయకులు టీడీపీ ప్రజారంజక పాలన నచ్చి వైసీపీకి రాజీనామాచేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరు టీడీపీ క్యాంపు కార్యాలయంలో మాజీమంత్రి యనమల రామకృష్ణుడు సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాకప్పి ఆహ్వానించిన యనమల రామకృష్ణుడు కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో విజయబాబుతో పాటుగా పోడాడ గ్రామానికి చెందిన సువర్ణలత, మూర్తి తాతాజీ, దడాల రత్నం, బుద్దా రామకృష్ణ, నక్కా ధారకొండ, దడాల నానిబాబు, తాటిపాక అనిల్‌తో పాటుగా పలువురు టీడీపీలోకి చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల రాజేష్, కొయ్యా శ్రీనుబాబు, చొక్కాఅప్పారావు, పాలిబోయిన చంద్రరావు, అంగుళూరి సుధాకర్, సోమాల ప్రసాద్, ఫులుగు రమణ, పక్కుర్తి సూరరాజు, యనమల బాల గోవిందు పాల్గొన్నారు.

కండి బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో?



జెడ్.రాగంపేట-నాయకంపల్లి మధ్యలో ఉన్న కండి కాలువ

గండేపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో జెడ్.రాగంపేట నుంచి నాయకంపల్లి వెళ్తే మార్గమధ్యంలో భారీ కండి ఉంది. సుమారు ఏడెనిమిది అడుగుల లోతులో కండి ఉంది. వర్షం వచ్చినప్పుడు ఆ కండికి వరదనీరు ప్రవహించడంతో ఒకవారం పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. అయితే ఆ కండి వద్ద బ్రిడ్జి వేయాలని ఇటు ప్రయాణికులు, అటు రైతులు కూడా ఏన్నో ఏళ్లగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. కండి కాలువపై బ్రిడ్జివేసి రైతులు, ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుం డా చేయాలని కోరుతున్నారు. గత ప్రభుత్వంలో నిధులు విడుదలైనప్పటికీ బ్రిడ్జి నిర్మాణం జరగలేదని పలువురు రైతులు తెలుపుతున్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

• ఎమ్మెల్యే సత్యప్రభ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ప్రత్తిపాడు తోటవీధి టీడీపీ కార్యాలయంవద్ద ఆదివారం నియోజకవర్గ టీడీపీ ముఖ్యనాయకులు, నియోజకవర్గం మీడియా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తన భర్త దివంగత వరుపుల రాజాపై ఉన్న అభిమానం, గౌరవం తనను గడిచిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయం అందించిన అన్ని వర్గాల వారికి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ఇళ్లస్థలాల విషయంపై సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పార్టీ సీనియర్ నాయకులు బద్ది రామారావు, పర్వత సురేష్, అమరాది వెంకట్రావు, కొండపల్లి శ్రీనివాస్‌లు ప్రసంగించగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పత్సవాయిసూర్యనారాయణరాజు, యాళ్ళ జగదీష్, యర్రాబత్తుల గోవిందనాయుడు, అంబటి బుజ్జి, బద్ది రమణ, గొంతిన సురేష్, పంచాది వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మాతృ దేవోభవ నాటికకు రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకేలో జరిగిన క్రియా రాష్ట్రస్థాయి పోటీల్లో లఘు నాటికల విభాగంలో సీనియర్స్‌లో మాతృ దేవోభవ నాటిక రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం పొందింది. ఈ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బి.చంద్రలేఖ, ఎ.కృష్ణవాణి, ఎస్.వాస్తవిదుర్గ, జి.వీరచక్ర, వారికి తర్ఫీదునిచ్చిన సివిక్స్ అధ్యాపకుడు బావిశెట్టి లక్ష్మీనారాయణను పాఠశాల హెచ్ఎం ఎల్.కృష్ణ, ఎస్ఎంసీ చైర్మన్ ఎలుబండి శ్రీను, సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి

నేడు రాచపల్లిలో రమణ మహర్షి జయంతి

• ఆంధ్రా అరుణాచలంగా ఖ్యాతి • రాష్ట్రం నలుమూలల నుంచి భక్తుల రాక



అరుణాచలేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం

ప్రత్తిపాడు, డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అరుణాచలేశ్వర ఆలయంగా ప్రసిద్ధిగాంచిన ఈ రమణ ఆశ్రమం అరుణాచలేశ్వర ఆలయ ప్రాంగణాల్లో రమణ మహర్షి జయంతిని ఈనెల 30న సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ప్రత్తిపాడు మం డలంలోని ప్రత్తిపాడు, ధర్మవరం జాతీయ రహదారిపై రాచపల్లి అడ్డురోడ్డు సెంటర్ నుంచి అర కిలోమీటరు దూరంలో ఈ రమణ సేవాశ్రమాన్ని 1990 ఆగస్టు 17న రాచపల్లికి చెందిన రమణానందస్వామి నెలకొల్పారు. ఈ ఆశ్రమానికి సమీపంలో తమిళనాడులోని అరుణాచలేశ్వర స్వామి ఆలయం మాదిరిగా 2008లో అపీత కుంచాబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకోగా పుష్కర కాలంలో ఈ ఆలయం పూర్తయింది. ఆలయానికి ఉప ఆలయాలుగా బసవేశ్వరస్వామి అపీతకుచాబ అమ్మవారు, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కృష్ణ మందిరం వంటి ఆలయా లు నిర్మించారు. పుష్కరిణిని కూడా ఏర్పాటు చేశారు. ఆలయ సమీపంలో స్వామీజీలు, ప్రముఖుల కోసం వసతి గృహాల నిర్మాణ పనులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. భగవాన్ రమణమహర్షి 145వ జయంతి సందర్భంగా సోమవారం ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు రమణానంద స్వామి తెలిపారు. దీనిలో భాగంగా వేలాది మందికి అన్నదానం నిర్వహించనున్నారు.

వైభవంగా సత్యదేవుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న అధికారులు, భక్తులు

అన్నవరం, డిసెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వా రాంతపు ఆర్జితసేవ అయిన రథోత్సవంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఉదయం 11గంటలకు స్వామి,అమ్మవార్లను ధనుర్మాస సేవ పూర్తిచేసుకుని రత్నగిరికి చేరుకోగానే టేకు రథంలో ఆశీనులు గా వించి పండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ముమ్మారు తూర్పు రాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. అధికసంఖ్యలో భక్తులతో పాటుగా ఈవో సుబ్బారావు కుటుంబ సభ్యులు, పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్‌లు ఐ.వి.రా మారావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

శ్రీ సాయిగణేష్ ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

జగ్గంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట శ్రీసాయి గణేష్ ఆటో యూనియన్ కాకినాడ రోడ్డు కాట్రావులపల్లిస్టాండ్ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. యూనియన్ స్థాపకుడు కాటే చిన్నబాబు, చీకట్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధరావు ముఖ్యఅతిధిగా హా జరయ్యారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐలను ఆటో యూనియన్ నాయకులు శాలువాకప్పి సత్కరించారు. అనంతరం జరిగిన కమిటీ ఎన్నికల్లో గౌరవాధ్యక్షులుగా గొర్రెల రమణ, అధ్యక్షులుగా మంజేటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మల్లవరపు దొరబాబు, కార్యదర్శిగా ఇమ్మిళ్ళ గంగాధర్, కోశాధికారిగా అప్పికొండ వెంకన్నబాబు, సభ్యులు నీతిపూడి చంటి, దుంగా సింహాచలం, వానశెట్టి విజయ్, గింజాల లోవరాజు, బత్తిన వీరబాబు, చేవా చిన్నోడు ఎన్నికయ్యారు.

ఆటోలకు స్టిక్కర్లు ఏర్పాటు

జగ్గంపేట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట సెంటర్ కాట్రావులపల్లి ఆటో స్టాండ్‌లో మొత్తం 110 మంది ఆటో ఓనర్ కమ్ డ్రైవర్లకు పోలీస్ నెంబర్ స్టిక్కర్లను ఆదివారం అందజేశారు. వారికి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ముఖ్యంగా స్కూల్ పిల్లలను దింపే ఆటోలు పరిమితికి మించి ఎక్కించుకోరాదని, హైవేలో ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, హైవే రోడ్‌లోని ప్రవేశిస్తున్న ప్పుడు ఆగి అటు ఇటు చూసుకోవాలని, ప్రతి డ్రైవరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ప్రతీ ఆటో ఇన్సూ రెన్స్ లైవ్‌లో ఉండేలా చూసే బాధ్యత యూనియన్ తీసుకోవాలని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. ఆటోలలో తోటి మహిళా ప్రయాణికులులాగా ప్రయాణిస్తూ బ్యాగుల్లో దొంగతనాలకు పాల్పడే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణికులను అప్రమత్తం చేయాలని, ఎవరైనా సరే దారి మధ్యలో దిగిపోతా నంటే ఏమాత్రం అనుమానంఉన్నా వెంటనే పోలీస్ వారికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జగ్గంపేట సెంటర్ కాట్రావులపల్లి ఆటో యూనియన్ ప్రెసిడెంట్, సెక్రటరీ, యూనియన్ సభ్యులు, ఎస్ఐ రఘు నందనరావు ఉన్నారు.

కళాకారులకు సత్కారం

ఏలేశ్వరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి):మండలంలోని లింగంపర్తిలో కళాకారులను సత్కరించారు. ఆదివారం ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఆలమూరి సుబ్బారావు నేతృత్వంలో ధనుర్మాసం పురస్కరించుకొని గ్రా మాల్లో కృష్ణుడు, రామాంజనేయులు, కాళికాదేవి, జాంబవంతుడు, శివుడు వేషాలతో అలరిస్తున్న కళాకారులను శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. సుబ్బారావు మాట్లాడుతూ హిందూ సంస్కృతీ సాంప్రదాయాలను వివిధ వేషధారణలో ప్రజలను అలరిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. వాగు బాబులు, ఉడతల రమణారావు, గవరసాని పెద్దకాపు, మోటేపల్లి నారాయణ, అడపా వీరభద్రరావు, అమ్మాజీ తదితరులు ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో మురారి దుర్గమ్మ

భక్తులకు దర్శనమిచ్చిన మురారి దుర్గమ్మ

గండేపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో మురారి గ్రామ శివారున వేప చెట్టు కింద వెలసిన దుర్గమ్మ ఆలయం భక్తులతో సందడిగా మారింది. తిరునాళ్ల వెళ్లి వారం అవుతున్నా భక్తుల తాకిడి ఏ మాత్రం తగ్గలేదు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించి కుటుంబసమేతంగా ఆలయ ప్రాంగణంలో సాయంత్రంవరకు ఆనందంగా గడిపారు.

గోపాలమిత్ర యూనియన్ అధ్యక్షుడిగా బెండా నానాజీ

ప్రత్తిపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా గోపాలమిత్ర యూనియన్ అధ్యక్షుడిగా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచికి చెందిన గోపాలమిత్ర యూనియన్ జిల్లా అధ్యక్షుడు బెండా నానాజీ ఎన్నికయ్యారు. కాకినాడలో నిర్వహించిన జిల్లా సంఘ నూతన కార్యవర్గంలో నానాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘఉపాధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, కార్యదర్శిగా ఎస్.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా వై.సత్యనారాయణ, ట్రెజరర్‌గా సీహెచ్‌గా కె.అప్పన్న మరో 14మంది కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు.

మండల బీజేపీ అధ్యక్షుడిగా లవుడు

రౌతులపూడి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండల బీజేపీ అధ్యక్షుడిగా మూలగపూడి గ్రామానికి చెందిన లవుడు శ్రీనివాస్‌ను నియమితులయ్యారు. ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాయంలో కాకినాడజిల్లా బీజేపీ అధ్యక్షుడు బిలుకూరి రాంకుమార్ సమక్షంలో శ్రీనువాస్‌ను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఊటా నాగశ్రీను, ప్రత్తిపాడు అసెంబ్లీ కన్వీనర్ సింగిలిదేవ్ సత్తిరాజు చిత్రాపాపారావు, తంటపురెడ్డి మాణిక్యం, కోరుప్రోలు గణేష్, కోళ్ల రమేష్ పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రత్తిపాడు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం గ్రామంలో ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ సభ్యులు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని 53 మంది పేదలకు, దివ్యాంగులు, అనాథ లకు క్లబ్ అధ్యక్షుడు ఇంజనీర్‌మోహన్, కార్యదర్శి ఏడిద రెడ్డి నాయుడు, కోశాధికారి ఇందన ఏసుబాబు, లయన్ డాక్టర్ ఎంఎస్ కిరణ్, లయన్ డేవిడ్‌రాజులు దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ సామాజిక సేవా విస్తృత పరిచే కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు పరిసర గ్రామాల్లో వారంరోజులపాటు సేవా కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన ఐవోటీ వర్క్‌షాపు

గండేపల్లి, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాలలో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న ఐఓటీ వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది. ఈ వర్క్‌షాపులో విశాఖపట్నంకు చెందిన కిరణ్‌కుమార్, శ్రీకాంత్ హాజరై విద్యార్థులకు ఐఓటీ టెక్నాలజీపై అవగాహన కల్పించి, విద్యార్థులచే ప్రాజెక్టులు చేయించారు.

గౌరీశంకర్ల పోస్టర్ ఆవిష్కరణ

ప్రత్తిపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో 88వ గౌరీశంకర్ల మహోత్సవాల్లో భాగంగా సంక్రాంతి పండుగ సందర్భంగా 5రోజులపాటు నిర్వహించే ఉత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఎంఎంఆర్ ట్రస్టు చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు ఆవిష్కరించారు. గ్రామంలో ఐకమత్యం పెంపుదలతో పాటు ఆధ్యాత్మిక చింతనకు గౌరీశంకర్ల ఉత్సవాలు గడిచిన 87 సంవత్సరాలుగా సజావుగా నిర్వహించడం ఎంతో గొప్ప విషయమని ఈ సందర్భంగా మురళీరాజు తెలిపా రు. ఈ ఉత్సవాల నిర్వహణకు రూ.25వేలు తన వంతున విరాళం అందించనునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీసభ్యులు కిల్లాడి బాబ్జి, కోనేటి రాజబాబు, గొర్ల వీర సాంబమూర్తి, గొనగాల రామకృష్ణ పాల్గొన్నారు.